సాక్షి
నల్లగొండ
శనివారం । 25 । ఫిబ్రవరి । 2023



నేటి నుంచి సైన్స్‌డే ఉత్సవాలు
ఎంజీయూలో 25 నుంచి జాతీయ సైన్స్ డే ఉత్సవాలు నిర్వహించనున్నట్లు వీసీ గోపాల్‌రెడ్డి తెలిపారు. - 10లో



అర్వపల్లి ఆలయానికి మహర్దశ
అర్వపల్లిలోని శ్రీయోగానందలక్ష్మీనర్సింహస్వామి ఆలయ అభివృద్ధికి రూ.5 కోట్లు మంజూరయ్యాయి. - 10లో

గరిష్ఠం/కనిష్ఠం
37° / 17°
వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

బుద్ధదర్శిని పేరుతో ప్రత్యేక బస్సు సౌకర్యం

దేవరకొండ : దేవరకొండ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో బుద్ధదర్శిని పేరుతో ప్రముఖ పర్యాటక స్థలాలైన నాగార్జునసాగర్, బుద్ధవనం, పుట్టంగండి, వైజాగ్‌కాలనీలకు ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించనున్నట్లు డిపో మేనేజర్ రాజీవ్ ప్రేమ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటలకు దేవరకొండ బస్ డిపో నుంచి బయల్దేరి నాగార్జునసాగర్ డ్యాం, బుద్ధవనం, మధ్యాహ్నం పుట్టంగండి, వైజాక్ కాలనీలను సందర్శించేలా నడుపుతామని వెల్లడించారు. రాత్రి 7 గంటలకు బస్సు దేవరకొండకు చేరుకుంటుందని పేర్కొన్నారు. 12 గంటల పాటు కొనసాగనున్న ఈ పర్యాటక యాత్ర బస్సు టిక్కెట్ పెద్దలకు రూ.350, పిల్లలకు రూ.200 ఉంటుందని పేర్కొన్నారు. ఈ బస్సు సర్వీసును ప్రతి శని, ఆదివారాల్లో నడుపుతామని తెలిపారు. పూర్తి వివరాలకు సెల్ నంబర్ 73828 32825, 73828 33031లను సంప్రదించాలని సూచించారు.

బుద్ధవనాన్ని సందర్శించిన తమిళనాడు ఎంపీ



ఎంపీకి బొకే అందజేస్తున్న సిబ్బంది

నాగార్జునసాగర్ : సాగర్ బుద్ధవనాన్ని తమిళనాడులోని చిదంబరం ఎంపీ డాక్టర్ తొల్కప్పియాన్ తిరుమవల్వాన్ శుక్రవారం సందర్శించారు. తపోవనం, జాతకపార్కు, స్థూపపార్కు తదితర ప్రాంతాలను సందర్శించారు. వీరికి బుద్ధవనం సిబ్బంది బొకే ఇచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జలాశయతీరంలో బుద్ధవనం బౌద్ధదామంగా విరాజిల్లుతోందన్నారు.

బోధనా విధానం మెరుగుపడాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న శంకర్ గౌడ్

మునుగోడు : ఉపాధ్యాయులు తమ బోధనా విధానాన్ని మెరుగు పర్చుకుని విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధించాలని రాష్ట్ర శిక్షణ పరిశోధన విద్యా మండలి పరిశీలకుడు మాదగోని శంకర్‌గౌడ్ సూచించారు. శుక్రవారం ఆయన మండలంలోని పలివెల, మునుగోడు ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించారు. ఇటీవల ప్రభుత్వం అమలుచేసిన తొలిమెట్టుతో పాటు పదో తరగతి విద్యార్థుల అదనపు తరగతుల బోధన గురుఇంచి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ త్వరలో జరగనున్న పదో తరగతి పరీక్షల్లో నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఆయన వెంట ఎంఈఓ కె.నర్సింహ, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు ఉన్నారు.

రాజకీయంగా చైతన్యవంతులు కావాలి



మాట్లాడుతున్న విశారదన్ మహారాజ్

చిట్యాల : బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలు రాజకీయంగా చైతన్యవంతులు అయినప్పుడే రాజ్యాధికారం సాధ్యమవుతుందని డీఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహారాజ్ పేర్కొన్నారు. ఆయన చేపట్టిన పదివేల కిలోమీటర్ల స్వరాజ్య పాదయాత్ర శుక్రవారం చిట్యాల మండలంలోని వెలిమినేడు, గుండ్రాంపల్లి, సుంకేనేపల్లి గ్రామాల మీదుగా కొనసాగింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఆయా డీఎస్‌పీ జెండాలను ఎగురవేసి మాట్లాడారు. కార్యక్రమంలో దుర్గా ప్రసాద్, సైదులు, యాదగిరి, నరేష్, రాకేష్, శంకర్, రాజేష్ పాల్గొన్నారు.

యాదాద్రిలో శాస్త్రోక్తంగా ఊంజలి సేవ

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం ఊంజలి సేవ ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ఆలయ మాఢ, తిరువీధుల్లో ఊరేగించారు. అనంతరం అద్దాల మండపంలో అధిష్టింపజేసి అమ్మవారికి ఊంజలి సేవ చేశారు. అదే విధంగా స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు.

వటపత్రశాయిగా నారసింహుడు



యాదాద్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం వటపత్రశాయిగా దర్శనమిచ్చిన స్వామివారు. అలంకార సేవ ఊరేగింపులో పాల్గొన్న గవర్నర్ తమిళిసై సౌందరరాజన్



హంస వాహన సేవపై నారసింహుడు

మారని రాతలు..

అర్థం కాని మందుల చిట్టీలు
- ఒక టాబ్లెట్‌కు బదులు మరొకటి ఇస్తున్న మెడికల్ షాపు నిర్వాహకులు
- అస్వస్థతకు గురవుతున్న రోగులు
- కేంద్ర ప్రభుత్వ సర్క్యులర్‌ను పట్టించుకోని డాక్టర్లు



అర్థంకాని విధంగా ఉన్న మందుల చిట్టీ



నల్లగొండలోని ఎస్‌ఎల్‌బీసీకి చెందిన రమణారెడ్డి రక్తనాళాలకు సంబంధించిన వ్యాధితో బాధపడుతూ పట్టణంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లాడు. అక్కడ ఆయనను పరీక్షించిన డాక్టర్ అతనికి TRENTOL 400 MG ట్యాబ్లెట్లు రాశాడు. సరిపడా డబ్బులు లేకపోవడంతో రమణారెడ్డి ఆ ఆస్పత్రిలోని మెడికల్ షాపులో మందులు తీసుకోకుండా వెళ్లిపోయాడు. రెండో రోజు ప్రకాశం బజార్‌లోని ఒక మెడికల్ షాపుకు వెళ్లి ఆ చిట్టీ చూపించి మందులు ఇవ్వమన్నాడు. దుకాణంలోని వ్యక్తి డాక్టర్ రాసిన చిట్టీని చూసి ఫిట్స్, నరాల బలహీనత, నొప్పులు, షుగర్‌తో బాధపడే వారికి ఇచ్చే TEGRETOL 400 MG ట్యాబ్లెట్లు ఇచ్చాడు. వాటిని తీసుకుని వాడిన రమణారెడ్డి మూడు రోజుల తర్వాత తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. తిరిగి డాక్టర్ దగ్గరకు పోయి చూపించుకుంటే వాడిన మందులను చూపించమని అడిగిన డాక్టర్ అవాక్కయ్యాడు. నేను రాసిన మందులు ఇవ్వలేదు. అందుకే అస్వస్థతకు గురయ్యావని చెప్పడంతో బాధితుడు ఖంగుతినాల్సి వచ్చింది. డాక్టర్ అర్థమయ్యే విధంగా విడి అక్షరాలతో మందుల చిట్టీ రాస్తే ఈ సమస్య వచ్చేది కాదు.

నల్లగొండ టౌన్ : ఆస్పత్రుల్లో రోగులకు అవసరమైన మందుల చిట్టీని డాక్టర్లు గొలుసుకట్టుగా రాస్తున్నారు. అవి మెడికల్ షాపు నిర్వాహకులకు అర్థం కాగా రాసింది ఒకటైతే.. మరొకటి ఇస్తున్నారు. దీని కారణంగా మందులు వికటించి రోగులు సైడ్‌ఎఫెక్ట్ బారిన పడి తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారు. మరికొన్ని సార్లు ప్రాణాలు సైతం పోగొట్టుకున్న ఘటనలు ఉంటున్నాయి. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ డాక్టర్లతో పాటుగా గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలను అందిస్తున్న పీఎంపీలు, ఆర్‌ఎంపీలు సైతం మందుల పేర్లు అర్థం కాని విధంగా రాస్తున్నారు. మరికొందరు డాక్టర్లు వారి మందుల దుకాణాల్లో పనిచేసే వారికి మాత్రమే అర్థమయ్యే విధంగా మందుల పేర్లు రాయడం విశేషం.

2016 కేంద్ర ప్రభుత్వం సర్క్యులర్ జారీ..
డాక్టర్లు మందుల చిట్టీని విడి అక్షరాల్లో రాయాలని నల్లగొండకు చెందిన చిలుకూరి పరమాత్మ 2010 నుంచి వివిధ రూపాల్లో పోరాడారు. ఫలితంగా కేంద్ర ప్రభుత్వం 2016 అక్టోబర్‌లో పార్లమెంట్‌లో చట్టం చేసి సర్క్యులర్‌ను జారీ చేసింది. మందుల చిట్టీలను విడి అక్షరాల్లో అర్థమయ్యే విధంగా తప్పకుండా రాయాలని డాక్టర్లను ఆదేశించింది. కానీ, ఆ ఆదేశాలను ఇప్పటికీ 90 శాతం మంది డాక్టర్లు పాటించడం లేదు. విడి అక్షరాల్లో మందుల పేర్లు రాయని డాక్టర్లపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. మందుల చిట్టీలను అర్థమయ్యే విధంగా రాయని డాక్టర్లను శిక్షించేలా చట్టం చేయాలని కోరుతూ 2018 ఆగస్టు 18న పార్లమెంట్ స్టాండింగ్ కౌన్సిల్ చైర్మన్‌కు పరమాత్మ 670 పేజీల లేఖలను కూడా అందించారు. పక్క రాష్ట్రమైన కర్ణాటకలో అక్కడి ప్రభుత్వం మందుల పేర్లను, రోగి వివరాలను బ్లాక్ లెటర్స్‌లోనే రాయాలని ప్రభుత్వ ఆస్పత్రుల్లోని ఓపీ చిట్టీలపై ముద్రించి అమలు చేయడం విశేషం.

డాక్టర్లను ఆదేశిస్తాం



మందుల పేర్లను బ్లాక్ లెటర్స్‌లోనే రాయాలని ప్రభుత్వ నిబంధనలు ఉన్నాయి. నిబంధనలు తప్పక పాటించాలని డాక్టర్లను ఆదేశిస్తాం. ఇప్పటికే అనేకసార్లు సమావేశాల్లో చెప్పాం కూడా. నిబంధనల ప్రకారం బ్లాక్ లెటర్స్‌లో మందులు రాయని వారిపై చర్యలు తీసుకుంటాం.
– డాక్టర్ అన్నిమళ్ల కొండల్‌రావు, డీఎంహెచ్‌ఓ

జరిమానా విధించాలి



కేంద్ర ప్రభుత్వ సర్క్యులర్ ప్రకారం విడి అక్షరాలలో మందుల పేర్లు రాయని డాక్టర్లకు జరిమానా విధించాలి. అవసరమైతే వారి లైసెన్స్ కూడా రద్దు చేయాలి. విడి అక్షరాలలో మందుల పేర్లను రాయని కారణంగా అనేక మంది రోగులు నష్టపోతున్నారు.
– చిలుకూరి పరమాత్మ, జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి

నేడు నకిరేకల్ మున్సిపల్ సమస్యలపై 'సాక్షి ఫోన్‌ఇన్'

ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు

నకిరేకల్ మున్సిపాలిటీ పరిధిలో కుక్కలు, కోతుల బెడదతో ఇబ్బందులు పడుతున్నారా.. మంచినీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాల సమస్యలు ఎదుర్కొంటున్నారా.. అయితే మీ సమస్యలను నేరుగా మున్సిపల్ కమిషనర్‌కు తెలియజేయండి. మున్సిపల్ కమిషనర్‌తో 'సాక్షి' శనివారం ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహిస్తోంది.

సాక్షి ఫోన్‌ఇన్

ఫోన్ చేయాల్సిన నంబర్ : 98489 71375



బాలాజీ, మున్సిపల్ కమిషనర్, నకిరేకల్

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

- వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్
- మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిలో పారిశుద్ధ్యం లోపంపై అసహనం



మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిలో వైద్యులకు సూచనలు చేస్తున్న అజయ్‌కుమార్

మిర్యాలగూడ అర్బన్ : వైద్య రంగంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టిందని, ఆస్పత్రుల్లో రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మెరుగైన వైద్యం అందించాలని వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఏరియా ఆస్పత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆపరేషన్ థియేటర్‌ను పరిశీలించి ఎలాంటి ఇన్‌ఫెక్షన్లు సోకకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. పలు వార్డుల్లో పురుషులు, మహిళను ఒకే గదిలో అడ్మిట్ చేయడాన్ని గమనించిన తక్షణమే వేర్వేరు వార్డులు కేటాయించాలని ఆదేశించారు. ఆస్పత్రిలో పారిశుద్ధ్యం లోపంపై అసహనం వ్యక్తం చేశారు. ఆస్పత్రి ఇంత అపరిశుభ్రంగా ఉంటే ఎలా అని ప్రశ్నించారు. ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలపై సూపరింటెండెంట్ శ్రీనివాస సమరద్‌ను మందలించారు. ఆస్పత్రి వైద్యులు, స్టాఫ్‌నర్సులు, ఇతర సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రి 200 పడకలకు అప్‌గ్రేడ్ అయ్యిందని.. ఇందుకోసం ప్రభుత్వం రూ.14 కోట్లు విడుదల చేసిందని తెలిపారు. వైద్యులు సకాలంలో ఆస్పత్రికి వచ్చేలా త్వరలోనే బయోమెట్రిక్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌ఎంఓ రాంబాబు, వైద్యులు శ్రీకాంత్, భానూప్రసాద్, వేణు, శ్రీనివాస్, మోషిన్ ఉన్నారు.

ఏరియా ఆస్పత్రిలో తనిఖీలు..
దేవరకొండ : దేవరకొండ ఏరియా ఆస్పత్రిని రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని ఆయా విభాగాల్లో రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరాతీశారు. వైద్యులు, సిబ్బందికి ఆయన పలు సూచనలిచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలో ఔట్ పేషెంట్, ఇన్ పేషెంట్ వార్డులో రోగుల సంఖ్య పెరిగిందని, అందుకు తగ్గట్టుగా వైద్య సేవలు అందించాలని సూచించారు. అందుకు సంబంధించి వివరాలను ఆస్పత్రి సూపరింటెండెంట్ రాములునాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డీసీహెచ్‌ఎస్ మాత్రునాయక్ తదితరులున్నారు.

ప్రభుత్వ లక్ష్యాల అమలుకు ప్రత్యేక కార్యాచరణ

- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

నల్లగొండ : ప్రభుత్వ లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేసేలా జిల్లాలో ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, పురపాలన, పట్టణ అభివృద్ధి శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్, రాష్ట్రస్థాయి ఉన్నత అధికారులతో కలిసి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా నుంచి కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి మాట్లాడి జిల్లాలో ఆయా కార్యక్రమాల ప్రగతిని వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు ఖుష్బూ గుప్తా, భాస్కర్‌రావు, డీఎఫ్‌ఓ భాస్కర్‌రావు, జిల్లా ఉద్యాన అధికారి సంగీతలక్ష్మి, డీఎంహెచ్‌ఓ కొండల్‌రావు ఉన్నారు.

సంత్‌సేవాలాల్ గొప్ప సంఘ సంస్కర్త



పూజలు నిర్వహిస్తున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నల్లగొండ టౌన్ : గిరిజనుల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహరాజ్ దేశం గర్వించదగ్గ గొప్ప సంఘసంస్కర్త అని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక గడియారం సెంటర్‌లో సంత్‌సేవాలాల్ 284వ జయంతి వేడుకలను కలెక్టర్ టి.వినయ్‌కృష్ణారెడ్డి, ట్రైకార్ చైర్మన్ రాంచందర్‌నాయక్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సేవాలాల్ చూపిన బాటలో ప్రతి ఒక్కరూ పయనించాలన్నారు. గిరిజనులకు పాలనాధికారం కల్పించాలన్న లక్ష్యంతో ప్రతి తండాను గ్రామపంచాయతీగా చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని చెప్పారు. జిల్లా కేంద్రంలో గిరిజన భవన్ నిర్మాణం కోసం స్థలం కేటాయింపునకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. మంత్రి జగదీశ్‌రెడ్డి సహకారంతో భవన నిర్మాణానికి నిధుల మంజూరుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రజాప్రతినిధుల సూచనల మేరకు గిరిజన భవన్ నిర్మాణానికి అనువైన స్థలాన్ని కేటాయించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్, గిరిజన సంక్షేమాధికారి రాజ్‌కుమార్, బంజారా సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌నాయక్, భగవాన్‌నాయక్, జెడ్పీటీసీ వంగూరు లక్ష్మయ్య, కేతావత్ దేవ్లా, జగన్‌సింగ్, ప్రదీప్‌నాయక్ ఇతర నాయకులు పాల్గొన్నారు.

'డబుల్ బెడ్‌రూం' దరఖాస్తులపై విచారణ



వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

మిర్యాలగూడ : పట్టణంలోని ఇండస్ట్రియల్ ఏరియాలో నిర్మించిన డబుల్‌బెడ్‌రూం ఇళ్ల పంపిణీకి స్వీకరించిన దరఖాస్తులపై రెవెన్యూ అధికారులు విచారణ కొనసాగుతోంది. పట్టణంలోని 48 వార్డుల నుంచి మొత్తం 12,436 దరఖాస్తులు వచ్చాయి. వాటిని క్షేత్రస్థాయిలో విచారణ చేసేందుకు పంచాయతీరాజ్ అధికారులను నియమించారు. వార్డుకు ఒక బృందం చొప్పున 48 బృందాలను ఏర్పాటు చేశారు. ఇందులో ఇద్దరు పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్, ఇద్దరు రిసోర్స్ పర్సన్‌లను నియమించారు. 9వార్డులకు ఒక ఎంపీఓను పర్యవేక్షణకు ఏర్పాటు చేశారు. శుక్రవారం పట్టణంలోని పలు వార్డుల్లో అధికారులు దరఖాస్తుదారులను విచారించారు. కార్యక్రమంలో ఎంపీఓ భిక్షంరాజు, డిప్యూటీ తహసీల్దార్ సైదులు, పంచాయతీ కార్యదర్శులు ఎస్‌కె.జాఫర్, జూనియర్ పంచాయతీ కార్యదర్శి కందిమళ్ల నరేందర్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు విజయ, మెహరాజున్నీసా, ఆర్పీలు శశికళ, శకుంతల, ఇందిరా, మెరాజ్ పాల్గొన్నారు.

పోడు భూములకు పట్టాలు

- 1,971 మంది రైతులను అర్హులుగా గుర్తించిన అధికారులు
- ఇప్పటికే 1400 పాస్‌పుస్తకాలు సిద్ధం
- మిగిలిన వారివి కలెక్టరేట్‌లో డౌన్‌లోడ్ చేస్తున్న సిబ్బంది
- త్వరలో పోడు రైతులకు అందనున్న పాస్‌బుక్కులు



పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

నల్లగొండ : పోడు రైతుల గోడు తీరనుంది. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పోడు రైతులకు త్వరలోనే అధికారులు పాస్‌పుస్తకాలు అందించనున్నారు. జిల్లాలో మొత్తం 1,971 మంది పోడు రైతులను అర్హులుగా గుర్తించగా 3,400 ఎకరాల భూమి వారి ఆధీనంలో ఉంది. ఇప్పటికే 1400 మంది పోడు రైతులకు పాస్‌బుక్కులు రాగా మిగిలిన వారివి కలెక్టరేట్‌లోని ఎలక్షన్ సెల్‌లో అధికారులు డౌన్‌లోడ్ చేస్తున్నారు. డౌన్‌లోడ్ ప్రక్రియను అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు శుక్రవారం పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

2005 కంటే ముందు సాగులో ఉన్న వారికి..
జిల్లాలో చాలా మంది రైతులు పోడు భూమిని సాగు చేసుకుంటున్నారు. కానీ ఆ భూములపై వారికి ఎలాంటి హక్కులు లేవు. దీంతో ఎన్నో ఏళ్లుగా ఆందోళనలు చేస్తున్నారు. దీంతో ప్రభుత్వం 2005 సంవత్సరం కంటే ముందునుంచి పోడు భూమి సాగు చేసుకుంటున్న రైతులకు హక్కులు కల్పించాలని నిర్ణయించింది. అందులో భాగంగా విధి విధానాలు రూపొందించి పోడు రైతులు నుంచి దరఖాస్తులు కూడా స్వీకరించింది. జిల్లాలో 20,446 మంది రైతులు దరఖాస్తు చేసుకోగా.. రెండు నెలల క్రితమే కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు సంబంధిత మండలాల్లో అర్హుల గుర్తింపునకు సర్వేలు నిర్వహించారు. మొత్తం 13 మండలాల్లో 160 చోట్ల పోడు రైతులు ఉన్నారు. ఆయా గ్రామాల వారీగా తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంపీఓ, పంచాయతీ కార్యదర్శులు ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించి లబ్ధిదారులను గుర్తించారు. ఫారెస్టు అధికారులు, రెవెన్యూ, సర్వే శాఖల ఆధ్వర్యంలో పోడు రైతులకు సంబంధించి భూముల హద్దులను కూడా నిర్ణయించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు.

కలెక్టరేట్‌లో ప్రక్రియ..
ఇప్పటికే పోడు రైతులకు సంబంధించి 1400 పాస్‌బుక్కులు వచ్చాయి. మిగిలిన పాస్‌బుక్కులను కలెక్టరేట్‌లోని ఎలక్షన్ సెల్‌లో ఆయా మండలాలకు చెందిన రెవెన్యూ, సర్వే సిబ్బంది ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేస్తున్నారు. కొందరు లబ్ధిదారులకు సంబంధించిన భూముల హద్దులు సక్రమంగా చూపించడం లేదు. ఒకరిద్దరివి సముద్రం, ఇతర ప్రాంతాల్లో చూపిస్తుండడంతో వాటిని సరిచేసేందుకు ఫారెస్టు సిబ్బంది సహకారం తీసుకుంటున్నారు.

పీఆర్‌సీ ఇవ్వాలని విద్యుత్ ఉద్యోగుల నిరసన



నల్ల బ్యాడ్జీలు ధరించి విద్యుత్ సర్కిల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

నల్లగొండ : విద్యుత్ ఉద్యోగులకు పీఆర్‌సీ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ విద్యుత్ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యోగులు శుక్రవారం నల్లగొండ సర్కిల్ కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నల్లగొండ జేఏసీ చైర్మన్ నిమ్మచెట్ల వెంకటయ్య, కన్వీనర్ నాగిరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నాన్చుడు ధోరణి అవలంభిస్తోందన్నారు. పీఆర్‌సీ అమలు చేయాలని నాలుగు రోజులపాటు నల్ల బ్యాడ్జీలతో ఉద్యోగులంతా నిరసన తెలుపుతారన్నారు. మార్చి 1, 2 తేదీల్లో డివిజన్ కార్యాలయం ఎదుట ధర్నా, 8 నుంచి 23వ తేదీ వరకు సర్కిల్ కార్యాలయం ఎదుట రిలే దీక్షలు, మార్చి 14న ఛలో కేటీపీఎస్ పాల్వంచ, 17న వరంగల్ ఎన్‌పీడీసీఎల్ ముట్టడి, 21న హైదరాబాద్ ఎస్‌పీడీసీఎల్ ముట్టడి, మార్చి 24న విద్యుత్ సౌద ముందు మహాధర్నా నిర్వహిస్తామని తెలిపారు. ప్రభుత్వం అప్పటికీ స్పందించకపోతే తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని చెప్పారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు నాగరాజు, వెంకటేశ్వర్లు, ఎంఏ ఫర్వేజ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వెండి మొక్కు జోడు సేవలు రద్దు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో భక్తులు నిర్వహించే వెండి మొక్కు జోడు సేవలను వచ్చే నెల 3వ తేదీ వరకు రద్దు చేస్తున్నట్లు ఆలయ ఈఓ గీతారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ వెండి మొక్కు జోడు సేవలను రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ఇందుకు భక్తులు సహకరించాలని కోరారు.

పురాతన శివలింగం చోరీ


శివలింగం

మిర్యాలగూడ: దామరచర్ల మండలం బొత్తలపాలెం గ్రామ శివారులో సుమారు 1350 సంవత్సరాల క్రితం నాటి శివలింగం గురువారం రాత్రి అపహరణకు గురైంది. బొత్తలపాలెం గ్రామంలో గల బైరవాని చెరువు కట్టపై కాకతీయ రెడ్డిరాజు నిర్మించిన శివాలయం శిథిలం కాగా.. గ్రామస్తులు శివలింగానికి పూజలు నిర్వహిస్తున్నారు. గురువారం రాత్రి 11 గంటల వరకు కూడా శివలింగం ఉందని, ఉదయం సమయంలో శివలింగం కనిపించలేదని చెరువు కాపలాదారులు తెలిపారు. అర్ధ రాత్రి సమయంలో శివాలయం వైపు ఒక ఆటో వెళ్లినట్లు గ్రామస్తులు గుర్తించారు. కాగా.. సంఘటన స్థలాన్ని ఎస్ఐ రవికుమార్ సందర్శించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జూదరుల అరెస్టు

గరిడేపల్లి : గరిడేపల్లి మండలంలోని రాయినిగూడెం గ్రామంలో చెరువు కట్ట వద్ద పేకాట ఆడుతున్న నలుగురిని శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేశారు. వారి నుంచి నాలుగు బైక్‌లు, రెండు సెల్‌ఫోన్లు, రూ.1500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరితోపాటు పరారైన వ్యక్తులపై కూడా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కొండల్‌రెడ్డి తెలిపారు.

గేదెను ఢీకొన్న బైక్.. ఒకరు మృతి


శ్రీహరిరాజు (ఫైల్)

పెద్దవూర: బైకుపై వెళ్తున్న వ్యక్తి గేదెను ఢీకొన్న ఘటనలో గాయాలపాలై చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. పెద్దవూర ఎస్ఐ పచ్చిపాల పరమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ రామంతపూర్‌కు చెందిన బొల్లెపల్లి శ్రీహరిరాజు (46)తన బైక్‌పై హాలియా నుంచి లింగంపల్లి గ్రామశివారులోగల తమ బత్తాయి తోటకు గురువారం రాత్రి 8.30గంటల సమయంలో వస్తున్నాడు. పెద్దవూర మండల పరిధిలోని లింగంపల్లి గ్రామం వద్ద అకస్మాత్తుగా రోడ్డుపైకి గేదె రావడంతో దానికి ఢీకొట్టాడు. బైక్ పైనుంచి కిందపడిన రాజు తలకు, చేతులకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అతడిని హైదరాబాద్‌కు తరలించగా చికిత్సపొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడి అన్న బొల్లెపల్లి శ్రీనివాసరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

హంసవాహన సేవలో యాదాద్రీశుడు


హంసవాహన సేవలో పాల్గొన్న భక్తులు


వటపత్రశాయి అలంకరణ సేవ విశిష్టతను వివరిస్తున్న ఆచార్యులు

- యాదాద్రి క్షేత్రంలో కొనసాగుతున్న శ్రీస్వామివారి బ్రహ్మోత్సవాలు
- ఉదయం వటపత్రశాయిగా.. సాయంత్రం హంసవాహన సేవలో భక్తులకు దర్శనం

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి క్షేత్రంలో వార్షిక బ్రహ్మోత్సాలు వైభవోపేతంగా కొనసాగుతున్నాయి. నాల్గవ రోజైన శుక్రవారం ఉదయం శ్రీస్వామి వారు వటపత్రశాయి అలంకార సేవలో.. సాయంత్రం హంస వాహన సేవలో భక్తులకు దర్శనమిచ్చారు.

ఆలయంలో వేకువజామునే..

ప్రధానాలయంలో వేకువజామునే నిత్యారాధనలు, నిత్యపూజల అనంతరం ఉదయం 7గంటల నుంచి 9గంటల వరకు పారాయణీకులు వేద పారాయణం పఠించారు. అనంతరం ఉదయం 9.23 గంటలకు శ్రీస్వామి వారిని వటపత్రశాయి అలంకారంలో ప్రత్యేక పల్లకీపై అధిష్టించి ఆలయ తిరుమాఢ వీధుల్లో ఊరేగించారు. అనంతరం పడమటి రాజగోపురం ఎదుట గల వేంచేపు మండపంలో శ్రీస్వామిని ప్రత్యేక బల్లపై అధిష్టించి విశేషంగా ఆరాధించారు. డోలు సన్నాయి మేళాలతో శ్రీస్వామికి మంగళకరమైన వాయిద్యాలతో కీర్తించారు. అలంకార సేవలో గవర్నర్ తమిళిసై సౌందర రాజన్, కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ దీపక్‌తివారీ, ఆలయ ఈఓ గీతారెడ్డి, అనువంశిక ధర్మకర్త నర్సింహమూర్తి, ఆచార్యులు, పారాయణీకులు, రుత్వికులు, ఆలయ అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

సాయంత్రం వేళ..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా సాయంత్రం ఆలయంలో నిత్యారాధనలు నిర్వహించారు. అనంతరం శ్రీస్వామి వారిని హంస వాహన అలంకార సేవలో అలంకరించి ఊరేగించారు. దక్షిణ దిశలోని ప్రథమ ప్రాకారం నుంచి ప్రారంభమైన అలంకార సేవ పడమటి రాజగోపురం నుంచి ఉత్తరం, తూర్పు, దక్షిణ రాజగోపురాల ముందు నుంచి ముందుకు సాగింది. పడమటి రాజగోపురం ఎదుట గల వేంచేపు మండపంలో శ్రీస్వామి సేవను అధిష్టించి ఆచార్యులు వేద మంత్రాలను పఠించారు.


వటపత్రశాయి అలంకరణలో స్వామివారు

ఆకట్టుకుంటున్న సాంస్కృతిక కార్యక్రమాలు

యాదాద్రి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా వైటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. శుక్రవారం సాయంత్రం డాక్టర్ అలేఖ్య పుంజాల బృందం సభ్యులు కూచిపూడి ప్రదర్శన, అన్నమాచార్య ప్రాజెక్టు టీటీడీ బృందం వారిచే అన్నమాచార్య సంకీర్తనలు నిర్వహించారు.

ఆలయంలో నేడు..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయంలో శనివారం ఉదయం శ్రీస్వామి వారిని శ్రీకృష్ణాలంకరణ (మురళీ కృష్ణుడు) సేవ నిర్వహించనున్నారు. ఇక సాయంత్రం పొన్నవాహన సేవ ఊరేగింపు జరిపిస్తారు.

కొనసాగుతున్న ఉచిత వైద్య శిబిరం

శ్రీస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా క్షేత్రానికి వచ్చే భక్తులకు యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలోని యాదగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు వంశీకృష్ణ, హరీష్ నేతృత్వంలో ఉచిత వైద్య సేవలు నిర్వహిస్తున్నారు. కొండపైన బస్టాండ్ వద్ద, కొండ కింద కల్యాణ కట్ట సమీపంలో భక్తులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు అందజేస్తున్నారు.




సాంస్కృతిక వేదికపై అన్నమాచార్య సంకీర్తనలు ఆలపిస్తున్న టీటీడీ బృందం


యాదాద్రి కొండపైన కూచిపూడి నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారిణులు

తప్పిపోయిన బాలుడు తల్లిదండ్రులకు అప్పగింత


బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి సాయి త్రిలోక్

గరిడేపల్లి : తప్పిపోయిన బాలుడిని చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులు అతడి తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాలిలా ఉన్నాయి. గురువారం రాత్రి గరిడేపల్లి మండలంలోని కితవారిగూడెంలో గుర్తుతెలియని బాలుడిని గ్రామ ప్రజలు గుర్తించి చైల్డ్ డిపార్ట్‌మెంట్ వారికి అప్పగించారు. బాలుడిని బాలల సంరక్షణ కేంద్రంలో ఉంచి విచారించగా అతడి పేరు వనమా రాజీవ్‌గా, తల్లిదండ్రులు పద్మావతి, సురేష్ అని చెప్పాడు. ఈమేరకు బాలుడిని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఆదేశాల మేరకు చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి సాయి త్రిలోక్ ఆధ్వర్యంలో ఖమ్మంలో ఉన్న బాబు తల్లిదండ్రులకు శుక్రవారం అప్పగించారు.

భువనగిరి పట్టణ అభివృద్ధే లక్ష్యం

- ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి


అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి

భువనగిరి : భువనగిరి పట్టణాన్ని అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని సమ్మద్ చౌరస్తా నుంచి జంఖానగూడెం చౌరస్తా వరకు చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో సీసీ రోడ్లతో పాటు డ్రెయినేజీ పనులు చేపడతామని, మంచి నీటి సమస్యలు లేకుండా చూస్తామని తెలిపారు. ఇప్పటికే పట్టణంలో సీసీ రోడ్లు వేయడం జరిగిందని, ప్రస్తుతం సమ్మద్ చౌరస్తా నుంచి జంఖానగూడెం చౌరస్తా వరకు అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయన్నారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ ఆంజనేయులు, వైస్ చైర్మన్ కిష్టయ్య, మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, బీఆర్ఎస్ పట్టణ కమిటీ అధ్యక్షుడు ఏవీ కిరణ్‌కుమార్, కార్యదర్శి రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్ హేమలత, నాయకులు జగన్, హరికిషన్ గౌడ్ తదితరులు నాయకులు ఉన్నారు.

భూమి విషయంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ

- పలువురికి గాయాలు


గాయపడిన సుధా కుటుంబ సభ్యులు

చివ్వెంల(సూర్యాపేట) : ఇంటి స్థలం విషయంలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో పలువురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన చివ్వెంల మండల పరిధిలోని ఉంద్రుగొండ గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో చర్చి పక్కన ఉన్న 221 గజాల స్థల విషయంలో గ్రామానికి చెందిన మాద సుధాకు అదే గ్రామానికి చెందిన శీలం నాగయ్య, శీలం శ్రీను, శీలం వెంకటేశ్వర్లు, శీలం పవన్‌ల మధ్యన ఘర్షణ నెలకొంది. ఈ క్రమంలో ఆ స్థలంలో బావి ఉండడంతో దానిని పూడ్చివేసి ఇంటి నిర్మాణం కోసం సుధా గ్రామ పంచాయతీ అనుమతులు తీసుకుంది. కాగా గ్రామానికి చెందిన శ్రీను, నాగయ్య, వెంకటేశ్వర్లు, పవన్‌లు అదే స్థలంలో ఇంటి నిర్మాణం చేపట్టారు. దీంతో శుక్రవారం స్థల విషయంలో సుధా, ఆమె సోదరుడు దార పుల్లయ్య, ఆయన కుమారుడు ప్రసన్న కుమార్, కూతుర్లు నవ్య, రాజేశ్వరీలకు నాగయ్య, శ్రీను, వెంకటేశ్వర్లు, పవన్‌లతో ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణతో ఇరువర్గాల వారికి గాయాలయ్యాయి. వీరిని స్థానికులు చికిత్స నిమిత్తం సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై ఎస్ఐ విష్ణుమూర్తిని వివరణ కోరగా ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

పోరాటాల ద్వారా సమస్యల పరిష్కారం

- సీపీఎం నేత జూలకంటి రంగారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రంగారెడ్డి

దురాజ్‌పల్లి (సూర్యాపేట): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు చేయడం ద్వారానే ప్రభుత్వాల మెడలు వంచి సమస్యలు పరిష్కారం చేసుకోగలుగుతామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన పార్టీ జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రజాధనాన్ని కొల్లగొడుతూ పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తుందన్నారు. దేశంలోని 10 శాతం మంది చేతుల్లో 100శాతం సంపద దాగి ఉందన్నారు. నరేంద్రమోదీ పాలనలో పేద, మధ్య తరగతి ప్రజలపై భారాలు మోపుతూ.. పెద్దలకు రాయితీలు కల్పించడం దుర్మార్గమన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీని అడుగుపెట్టనివ్వకుండా అడ్డుకుంటమన్నారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు, బుర్రి శ్రీరాములు, రవి నాయక్, మేదరమెట్ల వెంకటేశ్వర రావు, కోట గోపి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో బహుజన రాజ్యస్థాపనే లక్ష్యం

కోదాడ: తెలంగాణ రాష్ట్రంలో బహుజన రాజ్యం స్థాపనే లక్ష్యంగా ముందుకు పోతున్నామని బీఎస్పీ ఉత్తరప్రదేశ్ ఎంపీ రాంజీగౌతమ్ అన్నారు. శుక్రవారం కోదాడలో జరిగిన ఆ పార్టీ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్ఎస్, దేశంలో బీజేపీ రెండు ఒకటేనన్నారు. రాష్ట్రంలో బహుజనులు ఏకమై రాజ్యాధికార సాధనకు పోరాడాలన్నారు. రాష్ట్రంలో లక్షకు పైగా బ్యాక్‌లాగ్ పోస్టులు ఉన్నాయని వాటిని వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆ పార్టీ నాయకులు మందా ప్రభాకర్, బాలస్వామి, దయానందరావు, పిల్లుట్ల శ్రీనివాస్, బొడ్డు కిరణ్, మల్లేశ్ యాదవ్, కాంపాటి శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు గుర్తించాలి

సాక్షి,యాదాద్రి : రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు గుర్తించి వాటిని పరిష్కరించేందుకు వ్యవసాయ శాఖ అధికారులు కృషి చేయాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన సంస్థల సహాయ సంచాలకులు డాక్టర్ మల్లారెడ్డి అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో శుక్రవారం ఏరువాక కేంద్రం జిల్లా సమన్వయ సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఆయా ప్రాంతాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వాటి నివారణ చర్యలు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డీఏఓ నీలిమ, నల్లగొండ ఇన్‌చార్జ్ డీఏఓ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో 15మందికి గాయాలు

సూర్యాపేట: పట్టణంలోని పలు వార్డుల్లో శునకాలు శుక్రవారం 15మందిపై దాడిచేసి గాయపరిచాయి. పట్టణంలోని రాజీవ్‌నగర్, కొత్తగూడెం బజార్, నెహ్రూనగర్‌లో 15మందిని శునకాలు గాయపరిచాయి. గాయపడ్డ వారిని సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించి టీకాలు వేశారు. ఇటీవల సూర్యాపేట పట్టణంలో కుక్కల బెడద తీవ్రమైందని, వాటిని కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు. కాగా, వివిధ ప్రాంతాల నుంచి సూర్యాపేట ఆస్పత్రికి రోజుకు కనీసం 30 నుంచి 40 కుక్క కాటు కేసులు వస్తున్నాయని డాక్టర్లు చెబుతున్నారు.

ఆత్మకూర్‌లో 6 గొర్రెలు మృతి

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట) : వీధి కుక్కల దాడిలో ఆరు గొర్రెలు మృతిచెందిన సంఘటన ఆత్మకూర్ మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ముత్యాల మల్లయ్య, నగిరె కృష్ణయ్యలు గొర్రెలను మేత కోసం గ్రామ శివారులోకి వేర్వేరుగా తోలుకుని వెళ్లారు. మధ్యాహ్నం సమయంలో గుంపులుగా వచ్చిన కుక్కలు ఒక్కసారిగా మందపై దాడిచేసి దాదాపు ఆరు గొర్రెలను చంపివేశాయి.


మృతిచెందిన గొర్రెలు

అప్పుల బాధతో యువకుడు ఆత్మహత్య


నాగరాజు (ఫైల్)

భువనగిరి : అప్పుల బాధతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన భువనగిరి మండల పరిధిలోని తుక్కాపురం గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఈర్ల నాగరాజు(27) భువనగిరి పట్టణంలోని ఓ పెట్రోల్ బంకులో పనిచేస్తున్నాడు. అప్పుల బాధతో మానసిక వేదనకు గురై శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో బిల్డింగ్ కొక్కానికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాగా తన మృతికి ఎవరు కారణం కాదని సూసైడ్ నోటు రాశాడు. మృతుడి సోదరి కృష్ణవేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై రాఘవేందర్‌గౌడ్ తెలిపారు.

వరిపంటకు చీడపీడల బెడద

- అధికంగా పురుగు మందులు వాడితే పంటకు నష్టం
- సస్యరక్షణ చర్యలు పాటించాలంటున్న వ్యవసాయాధికారి


ఎండీ జానిమియా

నడిగూడెం : ప్రస్తుత రబీ సీజన్‌లో వరి పంట పెరిగే దశలోనూ, పలు ప్రాంతాల్లో చిరు పొట్ల దశల్లో ఉంది. అయితే వరి పంటకు చీడపీడలు ఆశించి నష్టపరుస్తున్నాయి. ఈ దశలో ఇష్టారాజ్యంగా పురుగు మందులు వాడొద్దని, మోతాదుగా వాడాలని సూర్యాపేట మండల వ్యవసాయాధికారి ఎండీ జానిమియా పేర్కొంటున్నారు. వరిసాగులో సస్యరక్షణ చర్యలపై సలహాలు, సూచనలు ఆయన మాటల్లోనే..

కాండం తొలుచు పురుగు


ఈ పురుగు నారుమడి, పిలకదశ, అంకురం నుంచి చిరు పొట్టదశ వరకు ఆశిస్తుంది. పిలక దశలో మొవ్వ చనిపోతుంది. అంకురం నుంచి చిరుపొట్ట దశలో ఆశిస్తే ఈనిన తర్వాత తెల్ల కంకులు బయటకు వస్తాయి. కంకి పాలు పోసుకోక తాలుపోతుంది. ఈ పురుగులు ఆలస్యంగా నాట్లు పెట్టిన లేదా ముదురు నాట్లు పెట్టిన పొలాల్లో ఆశిస్తాయి. నత్రజని ఎరువులు తక్కువగా వాడడం వల్ల కాండం బలహీనంగా మారినప్పుడు ఆశిస్తుంది.




వరి పైరుకు సోకిన అగ్గితెగులు, పాముపొడ తెగులు

నివారణ చర్యలు

నాట్లు ఆలస్యమైనప్పుడు నారు కొనలను తుంచి వేసుకోవాలి. ఎకరానికి మూడు లింగాకర్షక బుట్టలు పెట్టి ప్రతివారం బుట్టలో పడే మగరెక్కల పురుగులను గమనించాలి. నష్ట పరిమితి స్థాయి దాటినప్పుడు మాత్రమే పురుగు మందులు పిచికారీ చేయాలి. దీనికి కార్టాఫ్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రాములు లేదా 0.3 మి.లీ. క్లోరాంట్రినిల్ ప్రోల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.



సుడిదోమ(దోమపోటు)

ఈ పురుగు నారుమడి లేదా పిలకల దశలో అరుదుగా, పొట్టదశ, ఈనిక దశల్లో ఎక్కువగా ఆశిస్తుంది. నీటి పైభాగంలో మొక్కల మొదళ్ల దగ్గర దోమలు కనబడతాయి. పిల్ల, పెద్ద పురుగులు రసాన్ని పీల్చడం వల్ల పైరు సుడులుగా ఎండిపోతుంది. ఉధృతి ఎక్కువగా ఉంటే పొలం ఎండిపోయి పడిపోవడం జరుగుతుంది.

అగ్గితెగులు

తొలిదశలో ఆకులపైన నూలు కండె ఆకారంలో మచ్చలు ఏర్పడి క్రమేణా అనుకూల వాతావరణ పరిస్థితుల్లో ఇవి విస్తరించి మచ్చలు, చివర్లు మొనదేలి ఉంటాయి. ఈ మచ్చల అంచులు ముదురు గోధుమ లేదా నలుపు రంగులో ఉండి ఆకులు కాలిపోయినట్లుగా వ్యాపిస్తుంది. సిఫారసు మేరకు కాకుండా నత్రజని ఎరువుల అధిక మోతాదుల్లో వాడడం, గాలిలో తేమ అధికంగా ఉండడం, మబ్బుతో కూడిన వాతావరణం, సన్నని వర్షపు జల్లులు ఈ తెగులు వ్యాప్తికి అనుకూలం.

నివారణ చర్యలు

విత్తన శుద్ధి తప్పనిసరిగా చేయాలి. పైరుపై తెగులు లక్షణాలు కనిపిస్తే పొలంలో నీటిని తీసివేయాలి. బాగా ఆరనివ్వాలి. దీని వల్ల శిలీంద్రం తాలూకు సిద్ధ బీజాలు నశిస్తాయి. ట్రైసైక్లేజోల్ 1.5గ్రాములు లేదా కాసుగామైసీన్ 2.5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

ఉల్లికోడు, గొట్టపు రోగం

ఇది నారుమడి, పిలక దశల్లో ఆశిస్తుంది. అంకురం ఉల్లి కాడవలె పొడగాటి గొట్టంలా మారి బయటకు వస్తుంది. కంకి వేయదు. దుబ్బుల్లో కొన్ని పిలకలు ఉల్లికాడవలె పొడగాటి గొట్టాలుగా మారతాయి. సెప్టెంబరులో 200 మి.మీ. కంటే ఎక్కువ వర్షం పడితే వ్యాపిస్తుంది.

నివారణ చర్యలు

దీనిని తట్టుకునే రకాలను సాగు చేసుకోవాలి. ఆలస్యంగా నాట్లు వేసినప్పుడు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలను 10కిలోలు లేదా ఫోరెట్ 10జి గుళికలను 5 కిలోలు ఎకరానికి నారు నాటిన 10నుంచి 15 రోజులకు వేసుకోవాలి.

నివారణ చర్యలు

దోమను తట్టుకొనే రకాలను సాగు చేసుకోవాలి. నత్రజని అధిక మోతాదు తగ్గించుకోవాలి. కాలిబాటలు తీయాలి. ఎసిఫేట్ 1.5 గ్రా, లేదా ఎథోఫెన్‌ప్రాక్స్ 2.0 మి.లీ, లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి..

పాముపొడ తెగులు

దుబ్బు చేసు దశ నుంచి కాండం, మట్ట, ఆకులపై మచ్చలు పెద్దవై పాము పొడ మచ్చలుగా ఏర్పడతాయి. మొక్కలు, పైరు పూర్తిగా ఎండిపోతుంది. తెగులు వెన్ను వరకు వ్యాపిస్తే తాలుగింజలు ఏర్పడతాయి.

నివారణ చర్యలు

విత్తన శుద్ధి చేయాలి. సిఫారసు మేరకు నత్రజని ఉపయోగించాలి. గట్లపై, చేనులో కలుపు మొక్కలు లేకుండా చూసుకోవాలి. హెక్సాకొనాజోల్ 2. మి.లీ. లేదా ప్రొపికొనాజోల్ 1మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.